ఒక్క మ్యాచ్‌కు 7.5 లక్షలు

ఐపీఎల్‌లో ప్లేయర్లపై కాసుల వర్షం!

బెంగళూరు: రానున్న ఐపీఎల్ సీజన్‌లో ప్లేయర్లపై కనకవర్షం కురిసే అవకాశం కనిపిస్తున్నది. ప్రపంచంలోనే అత్యంత ధనిక లీగ్‌గా పేరొందిన ఐపీఎల్‌లో ప్లేయర్లకు మరింత ఆర్థిక లబ్ధి జరిగేలా నిర్వహకులు ప్రణాళికలు రచిస్తున్నారు. ఆదివారం బీసీసీఐ ఏజీఎమ్‌తో పాటు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ భేటీ జరుగనుంది. ఇందులో పలు కీలకమైన నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా వేలంలో ఒక్కో జట్టు ఎక్కువలో ఎక్కువ ఆరుగురు ప్లేయర్లను అట్టిపెట్టుకోవడంతో పాటు రైట్ టు మ్యాచ్ కార్డ్ ప్రయోగించే చాన్స్ ఇవ్వనున్నారు. దీనికి తోడు లీగ్‌లో ఒక్కో మ్యాచ్‌కు రూ.7.5లక్షలు, మొత్తం మ్యాచ్‌లు ఆడితే 1.05 కోట్లు దక్కుతాయని బీసీసీఐ కార్యదర్శి జై షా ట్వీట్ చేశారు. అదనంగా ఒక్కో ఫ్రాంచైజీ 12.60 కోట్లు మ్యాచ్ ఫీజుగా కేటాయించనున్నారు.

ప్రభాత్ (6/42)

భారీ గెలుపు చేరువలో లంక

గాలె:న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక భారీ విజయంపై కన్నేసింది. సమిష్టి ప్రదర్శనతో అదరగొడుతున్న లంక.. కివీస్‌కు చుక్కలు చూపిస్తున్నది. ఓవర్‌నైట్ స్కోరు 22/2 శనివారం తొలి ఇన్నింగ్స్‌కు దిగిన కివీస్..లెఫ్టార్మ్ స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య (6/42) ధాటికి 88 పరుగులకే కుప్పకూలింది. లంకపై టెస్టుల్లో కివీస్‌కు ఇదే అత్యల్ప తొలి ఇన్నింగ్స్‌గా రికార్డయ్యింది. సాంట్నర్ (29) టాప్‌స్కోరర్‌గా నిలువగా, మిగతా బ్యాటర్లు స్వల్ప స్కోర్లకు పరిమితమయ్యారు. ఆ తర్వాత ఫాలోఆన్‌కు దిగిన కివీస్ ఆట ముగిసే సరికి 5 వికెట్లకు 199 పరుగులు చేసింది. కాన్వే (61) అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, విలియమ్సన్ (46), బ్లండెల్(47 నాటౌట్) రాణించారు. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవడానికి 315 పరుగుల దూరంలో ఉంది.

రెండో రోజు రద్దు

- భారత్, బంగ్లా టెస్టుకు వర్షం అడ్డంకి
- ఒక్క బంతీ పడని వైనం
- ఇండోర్ ప్రాక్టీస్‌లో ప్లేయర్లు

కాన్పూర్: భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టును వరుణుడు నీడలా వెంటాడుతున్నది. దాదాపు మూడేండ్ల తర్వాత జరుగుతున్న మ్యాచ్‌ను ఆస్వాదిద్దామనుకున్న ప్రేక్షకుల ఆశలపై నీళ్లు గుమ్మరిస్తున్నాడు. ముందే ఊహించినట్లు, వాతావరణ శాఖ అంచనాల ప్రకారం తొలి రోజే మ్యాచ్‌కు అంతరాయం కల్గిన వర్షం రెండో రోజు ఆటను పూర్తిగా తుడిచిపెట్టింది. రాత్రి నుంచి కురిసిన ఎడతెరిపిలేని వర్షానికి మైదానం మొత్తం చిత్తడిగా మారిపోయింది. ఉదయం 11.15 నిమిషాలకు కొంత తెరిపినిచ్చినా..గ్రౌండ్స్‌మెన్ మూడు సూపర్ సాపర్లతో మైదానాన్ని సిద్ధం చేసేందుకు ప్రయత్నించినా వెలుతురు సరిగ్గా లేకపోవడంతో ఆట సాధ్యపడలేదు. పరిస్థితులు ఆటకు అనుకూలంగా లేకపోవడంతో మైదానాన్ని పరిశీలించిన అంపైర్లు మధ్యాహ్నం 2.15గంటలకు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. వాతావరణ రిపోర్టుల ప్రకారం ఆదివారం కూడా వర్షం కొనసాలగే అవకాశాలు కనిపిస్తుండగా, సోమ, మంగళవారాలు కొంత తెరిపినిచ్చే చాన్స్ ఉంది. దీంతో మ్యాచ్ దాదాపు డ్రా అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత్‌కు టాస్ చేజార్చుకున్న బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే వర్షం కారణంగా టీమ్‌ఇండియా ప్లేయర్లు ఇండోర్‌లో ప్రాక్టీస్ చేశారు. బ్యాచ్‌లుగా విడిపోయి సరదాగా ఫుట్‌బాల్ ఆడారు.

నితీశ్‌కు చాన్స్

యూపీ పేసర్ మయాంక్‌కు బెర్తు • బంగ్లాతో టీ20 సిరీస్‌కు జట్టు ఎంపిక

భారత జట్టులోకి తెలుగు క్రికెటర్

మయాంక్

న్యూఢిల్లీ: భారత్ టీ20 జట్టులోకి తెలుగు యువ క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డి దూసుకొచ్చాడు. గత ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెరుపులు మెరిపించిన నితీశ్‌కు సీనియర్ సెలెక్టర్లు మరోమారు అవకాశమిచ్చారు. బంగ్లాదేశ్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం శనివారం ఎంపిక చేసిన టీమ్‌ఇండియాలో నితీశ్ చోటు దక్కించుకున్నాడు. వాస్తవానికి టీ20 ప్రపంచకప్ ముగిసిన వెంటనే జరిగిన జింబాబ్వే పర్యటనకు నితీశ్ ఎంపికైనా..గాయం కారణంగా దూరం కావాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే సూర్యకుమార్‌యాదవ్ నేతృత్వంలో బరిలోకి దిగనున్న భారత జట్టులోకి ఐపీఎల్ యువ సంచలనం, యూపీ స్పీడ్‌స్టర్ మయాంక్ యాదవ్ బెర్తు దక్కించుకున్నాడు. ఐపీఎల్‌లో లక్నో సూపర్‌జయింట్స్ తరఫున ఆడిన మయాంక్ నిలకడగా గంటకు 150కి.మీల వేగంతో బంతులు వేసి ప్రత్యర్థి బ్యాటర్ల వెన్నులో వణుకు పుట్టించాడు. అయితే లీగ్ మధ్యలోనే మయాంక్‌కు గాయం కావడంతో జాతీయ జట్టుకు ఎంపిక కాలేకపోయాడు. ఇన్ని రోజులు జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ)లో పునరావాసం పొందిన మయాంక్ సెలెక్టర్ల నమ్మకాన్ని చూరగొన్నాడు. అభిషేక్‌శర్మ, రింకూ సింగ్, రియాన్ పరాగ్, శివమ్‌దూబే, సుందర్, బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, జితేశ్‌శర్మ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గ్వాలియర్, ఢిల్లీ, హైదరాబాద్ వేదికలుగా బంగ్లాతో భారత్ తలపడనుంది.

జట్టు వివరాలు: సూర్యకుమార్‌యాదవ్(కెప్టెన్), అభిషేక్, శాంసన్, రింకూసింగ్, హార్దిక్ పాండ్యా, రియాన్ పరాగ్, నితీశ్‌కుమార్‌రెడ్డి, శివమ్ దూబే, సుందర్, బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, జితేశ్‌శర్మ, అర్ష్‌దీప్‌సింగ్, హర్షిత్ రానా, మయాంక్ యాదవ్.

బోపన్న జోడీ ఔట్

బీజింగ్: చైనా ఏటీపీ ఓపెన్ టోర్నీలో రోహన్‌బోపన్న, ఇవాన్ డోడిగ్ జోడీ పోరాటం ముగిసింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న, డోడిగ్ ద్వయం 5-7, 6-7తో ఫ్రాన్సిస్కో సెరుండోలో, నికోలస్ జారీ ద్వయం చేతిలో ఓటమిపాలైంది. గంటన్నర పాటు సాగిన పోరులో బోపన్న, డోడిగ్‌కు అన్‌సీడెడ్ ప్రత్యర్థి నుంచి ఊహించని రీతిలో ఓటమి ఎదురైంది. ఇదిలా ఉంటే 44 ఏండ్ల బోపన్న ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, మియామి ఓపెన్ గెలిచిన సంగతి తెలిసిందే.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ టోర్నీ

మాదాపూర్, సెప్టెంబర్ 28: జాతీయ బాస్కెట్‌బాల్ టోర్నీ శనివారం ఘనంగా మొదలైంది. స్థానిక చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా ఈనెల 28 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరుగనున్న టోర్నీలో 60కి పైగా జట్లు పోటీ పడుతున్నాయి. ఇందులో అండర్-14, అండర్-19 బాల బాలికలు బరిలోకి దిగుతున్నారు. పోటీలకు తొలి రోజు వివిధ విభాగాల్లో హోరాహోరీగా సాగాయి. ఎఫ్ఐబీఏ మాజీ కమిషనర్ నార్మన్ ఇసాక్, భారత ప్లేయర్ పుష్పా సెంథిల్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుష్పు మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని యువ ప్లేయర్లకు దిశానిర్దేశం చేశారు. తమ స్కూల్‌లో చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యమిస్తామని ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ సంచిత రాహా పేర్కొన్నారు.

ముషీర్‌ఖాన్‌కు ప్రమాదం

రోడ్డు యాక్సిడెంట్‌లో తీవ్ర గాయాలు • మూడు నెలల పాటు క్రికెట్‌కు దూరం

లక్నో: ముంబై యువ ఆల్‌రౌండర్ ముషీర్‌ఖాన్ తృటిలో పెను ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డాడు. శనివారం తన స్వస్థలం అజంఘర్ నుంచి లక్నోకు కారులో బయల్దేరిన ముషీర్ ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ హైవేపై రోడ్డు డివైడర్‌ను వేగంగా ఢీకొట్టిన ముషీర్ ఖాన్ కారు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం పూర్తిగా నుజ్జునుజ్జు కాగా ముషీర్‌తో పాటు తండ్రి నౌషాద్‌ఖాన్ తీవ్ర గాయాల పాలయ్యారు. వెంటనే స్పందించిన స్థానికులు దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ముషీర్ ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా ఉందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మేదాంత దవాఖాన ఆర్థోపెడిక్ డైరెక్టర్ ధర్మేంద్రసింగ్ పేర్కొన్నారు. ముషీర్ ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు బీసీసీఐతో పాటు ముంబై క్రికెట్ అసోసియేషన్(ఎమ్‌సీఏ) ఒక ప్రకటనలో పేర్కొంది. అతను కొద్దిగా కుదురుకున్న తర్వాత ముంబైకి తరలించి మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. ఇదిలా ఉంటే రోడ్డు ప్రమాదం కారణంగా త్వరలో జరుగనున్న ఇరానీ కప్‌తో పాటు రంజీ ట్రోఫీలో కొన్ని మ్యాచ్‌లకు ముషీర్ దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సింగిల్స్ చాంప్ భవేశ్

జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్(జేబీసీ) 8వ ఎడిషన్‌లో భవేశ్‌రెడ్డి సింగిల్స్ విజేతగా నిలిచాడు. శనివారంతో ముగిసిన టోర్నీలో బాలుర అండర్-13 సింగిల్స్ ఫైనల్లో భవేశ్ 15-13, 15-4తో గోయల్ దర్శ్‌పై అలవోక విజయం సాధించాడు. ఆది నుంచే తనదైన జోరు కనబరిచిన భవేశ్..ప్రత్యర్థిని వరుస గేముల్లో చిత్తుచేశాడు. మిగతా విభాగాల్లో శ్రీరామ్, సానియాశర్మ(అండర్-11), దశరి(అండర్-13), శ్రీహర్ష, మాన్య అగర్వాల్(అండర్-15), అలీ సిద్ధిఖీ, మాన్య అగర్వాల్(అండర్-17) విజేతలుగా నిలిచారు. రైలు నిలయంలో జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి భారత స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దేశంలోని వివిధ నగరాల్లో ఎక్కువ మంది పిల్లలు పోటీపడ్డ టోర్నీగా జేబీసీ వరుసగా మూడోసారి ప్రపంచ రికార్డు సొంతం చేసుకుందని నిర్వహకులు పేర్కొన్నారు.

గాయత్రి, త్రిసా జోడీకి కాంస్యం

మకావు: మకావు ఓపెన్ సూపర్-300 టోర్నీలో భారత యువ ద్వయం గాయత్రి గోపీచంద్, త్రిసాజాలీకి కాంస్య పతకం దక్కింది. శనివారం జరిగిన మహిళల డబుల్స్ సెమీఫైనల్లో గాయత్రి, త్రిసా జోడీ 17-21, 21-16, 10-21తో చైనీస్‌తైపీ జంట హు పీషాన్, హంగ్ ఎన్‌జు చేతిలో పోరాడి ఓడింది. మూడోసీడ్‌గా బరిలోకి దిగిన గాయత్రి, త్రిసా.. చైనీస్ జోడీకి దీటైన పోటీనివ్వడంలో విఫలమయ్యారు. తొలి గేమ్‌లో ఒకింత ప్రతిఘటన కనబరిచినా..వీరు రెండో గేమ్ గెలిచి పోటీలోకి వచ్చారు. అయితే నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ప్రత్యర్థి నుంచి ఊహించని పరాజయం ఎదురైంది. వీరి నిష్క్రమణతో మకావు ఓపెన్‌లో భారత్ పోరాటం ముగిసింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.